# దేశ అభివృద్ధి, సమైక్యత కోసం బీజేపీకి ఓటు వేయండి

## వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్

హనుమకొండ 11 ఏప్రిల్ వాయిస్ టుడే ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హన్మకొండ వేద కన్వెన్షన్ లో గురువారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల బూత్ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో బీజేపీ ని గెలిపించి హ్యాట్రిక్ ప్రధాని గా మోదీ ని చేద్దాం. దేశ అభివృద్ధి, సమైక్యత కోసం బీజేపీకి ఓటు వేయండి. మోదీ వచ్చాక మత కలహాలు, కర్ఫ్యూలు లేవు.కాంగ్రెస్ హయాంలో అన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ప్రస్తుతం విదేశాలకు ఎగుమతులు చేస్తున్నాం.కాంగ్రెస్ హయాంలో అన్ని రంగాల్లో అవినీతి.వాళ్లు ఆర్టికల్ 370 పేరుతో దారుణాలు చేశారు.బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370ను తొలగించింది.ప్రస్తుతం బీజేపీ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ఎంపికలో ప్రచారంలో ప్రజల మద్దతు కూడగట్టడంలో బిజెపి ముందు వరుసలో ఉంది.టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులు దొరకక మిగతా పార్టీల నాయకుల కోసం అభ్యర్థుల కోసం వేటలో ఉన్నారు.మేము ఇప్పటికే మండల స్థాయి వరకు ప్రచారం చేసుకుంటున్నాం రానున్న రోజుల్లో ప్రచారం మరింత జోరందుకొనుంది. కచ్చితంగా రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుంది జీవితంలో రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదు ఆ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ మాకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ ఓటమి లక్ష్యంగా పనిచేస్తాం. కాంగ్రెస్ పార్టీ అవినీతి అసమర్థత వెన్నుపోటు రాజకీయాలకు పెట్టింది పేరు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పార్టీ కుటుంబ పాలన ను ప్రజల్లోకి తీసుకెళ్తాం.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కమలం పువ్వు గుర్తు పై ఓటు వేసి నన్ను గెలిపించాలని, మోడీ ని ఆశీర్వదించాలని ఓరుగల్లు ప్రజలను కోరుతున్నాను. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

### ప్రజల విశ్వాసం కోల్పోయింది

### బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



ధర్మపురి, ఏప్రిల్ 11: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతా అస్తవ్యస్తంగా మారిందని, నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ముస్లింలంటే చిన్నచూపు చూస్తున్నదని, రంజాన్ పండుగ వేళ కనీసం తోఫాలు కూడా ఇవ్వరా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని మతాలను సమానంగా చూసి, ముస్లింలకు పెద్దపీట వేసి, అండగా నిలిచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. గురువారం ఆయన జగిత్యాల జిల్లా ధర్మపురిలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగు నీరు ఇవ్వకుండా, రైతుబంధు, రుణమాఫీ, పంటకు రూ.500 బోనస్ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో టెయిల్ ఎండ్ ప్రాంతాలకు కూడా సాగునీరందించినట్టు తెలిపారు. తమ హయాంలో ఎక్కడా ఎకరం కూడా ఎండిన దాఖలాలు లేవని అన్నారు. ఏడాదికి 1.20 కోట్ల ఎకరాల్లో పంటలు పండించుకున్నామని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పాలనలో సాగునీరందక యాసంగిలో 20 లక్షల ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయని ఆవేదన చెందారు. రైతులు కన్నీరు పెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 209 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. గ్రామాల్లో తాగునీటి కష్టాలు నెల రోజుల నుంచే మొదలయ్యాయని విమర్శించారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.200 కోట్ల నిధులను కాంగ్రెస్ సర్కారు రద్దు చేసిందని ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, తాము చేసిన అభివృద్ధిని చూసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## కోడ్ ముగియగానే రైతుబంధు.. రుణమాఫీ

### మరో ఐదేండ్లు రేవంత్‌రెడ్డే సీఎం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి



రామగిరి, ఏప్రిల్ 11 : ప్రజలకు హామీ ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపించిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే రైతుబంధు, రుణమాఫీ అందజేస్తామని ప్రకటించారు. గురువారం రంజాన్ సందర్భంగా నల్లగొండలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గాకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చూస్తే కుల, మతాల ఘర్షణలు పెట్టి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నదని ఆరోపించారు. రాబోయే పదేండ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని పేర్కొన్నారు.

## పల్లెలకొస్తే కాంగ్రెస్‌ను తరిమికొడ్తం

### కాంగ్రెస్‌కు మాదిగల ఓట్లు అడిగే హక్కు లేదు

### హస్తం నేతలకు మంద కృష్ణమాదిగ హెచ్చరిక

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 11 : తెలంగాణలో మెజార్టీ శాతం ఉన్న మాదిగలను విస్మరించిన కాంగ్రెస్‌కు మాదిగలను ఓట్లు అడిగే హక్కు లేదని, ఓట్ల కోసం మాదిగ పల్లెలకు వస్తే తరిమి కొడుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. గురువారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. మాదిగల ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కాంగ్రెస్ చర్యలతో మాదిగల్లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు అవకాశం ఇవ్వాలని, ప్రకటించిన స్థానాలను మార్చి రెండు పార్లమెంట్ సీట్లతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు పెద్దపీట వేస్తున్నదని విమర్శించారు. మాదిగ కోటా కింద దామోదర రాజనర్సింహకు మంత్రి పదవి ఇచ్చి విలువ లేకుండా చేశారని మండిపడ్డారు. ఇటీవల బాబుజగ్జీవన్‌రామ్ భవన ప్రారంభ ఆహ్వాన పత్రికలో రాజనర్సింహ పేరే లేదని తెలిపారు. సమాన వాటా అడిగితే తమను బీజేపీ మనుషులంటున్నారని, జగ్గారెడ్డి మొదలు ఏ పార్టో గుర్తు చేసుకోవాలని సూచించారు. తమ ఓట్లతో నాయకుడిగా ఎదిగిన రేవంత్‌రెడ్డి మాదిగలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే మాల కావడం వల్లే మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు.

# పార్టీ మారితే చావుడప్పు కొడతాం


**ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందే**

**దానం, కడియం, తెల్లంపై వేటు వేయాల్సిందే**

**వారిపై ఫిర్యాదు చేస్తామంటే స్పీకర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు**

**పోస్ట్, మెయిల్ ద్వారా పిటిషన్ పంపించాం**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కౌశిక్‌రెడ్డి , కోవలక్ష్మి**



హైదరాబాద్, ఏప్రిల్ 11 : పార్టీ ఫిరాయించిన ఎమెల్యేలు రాజీనామా చేయకపోతే వారి ఇండ్లముందు ధర్నాలు చేస్తామని, చావుడప్పులు కొడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. ఈ విషయంలో ఎవ్వర్నీ వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. 'పార్టీలు మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో ఉరికించి కొట్టాలి. నడిబజారులో ఉరితీయాలి' అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని సవాల్ చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి మీడియా సమావేశం నిర్వహించారు. కేపీ వివేకానంద మాట్లాడుతూ.. సొంత పార్టీ ఎమ్మెల్యేలపై నమ్మకం లేకనే రేవంత్‌రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరేందుకు తమకు స్పీకర్ సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో లీగల్ టీమ్‌తో సంప్రదించి, రిజిస్టర్ పోస్టులోనూ, మెయిల్ ద్వారా స్పీకర్ కార్యాలయానికి పిటిషన్ పంపించినట్టు వెల్లడించారు. పార్టీ మారిన వారిపై వెంటనే అనర్హత వేటు వేయాలని కోరినట్టు తెలిపారు. అనర్హతల పిటిషన్లపై మూడు నెల్లలో సరైన నిర్ణయం తీసుకోవాలనే సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కూడా జత చేశామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీ ఫిరాయించిన వారిని అనర్హులుగా అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పుకు రాజకీయ రంగు పులుమితే ఎక్కడికక్కడ ధర్నాలు, దీక్షలు చేస్తామని, వెనకడుగు వేయబోమని హెచ్చరించారు.

ఫిరాయింపుదారులకు డిపాజిట్లు దక్కవు

దానం నాగేందర్ పార్టీ మారిన అంశంపై మార్చి 18న స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఆ కేసు వచ్చే సోమవారం వాదనకు వస్తుందని, దానం నాగేందర్‌తోపాటు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు తప్పదని జోస్యం చెప్పారు. హైకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ప్రజాపాలనంటూ గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పిటిషన్ తీసుకునేందుకు స్పీకర్ కార్యాలయం భయపడుతున్నదని పేర్కొన్నారు. పార్టీ మారినోళ్లకు సిగ్గు, శరం ఉంటే, మొగోళ్లే అయితే, దమ్ము, ధైర్యం ఉంటే వెంటనే రాజీనామా చేసి, మళ్లీ పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ఫిరాయింపుదారులకు డిపాజిట్లు కూడా రాకుండా అడ్డుకుంటామని చెప్పారు.

### నాపై తప్పుడు ప్రచారం: కోవలక్ష్మి

ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా సరిగ్గా అమలు చేయలేక ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను పార్టీ మారుతున్నాననే వార్తల్లో నిజం లేదని చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మేము అడవి బిడ్డలం. మాట మీద ఉంటాం. కేసీఆర్ సార్‌తోనే ఉంటాం. ప్రజా సమస్యల మీద కచ్చితంగా పోరాడతాం' అని చెప్పారు. ప్రజల సమస్యలు విన్నవించేందుకు మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులను కలిస్తే పార్టీలు మారుతున్నారని ప్రచారం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ మారబోనని, మీడియా కూడా జాగ్రత్తగా వార్తలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మొగుళ్లపల్లి ముత్తమ్మ కు ఘన నివాళి

### కామ్రేడ్ తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు

తొర్రూర్ ఏప్రిల్ 11 వాయిస్ టూడే: తొర్రూర్ మండలం లోని, వెంకటాపురం గ్రామాని కి చెందిన మొగుళ్లపల్లి ముత్తమ్మ ,తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,ఈ రోజు ఉదయం ఎనిమిది గంటల కు మృతి చెందినారు.ఈ విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు కామ్రేడ్ తమ్మెర విశ్వేశ్వరరావు,,ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ ఓమ బిక్షపతి,జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘనపురం లక్ష్మణ్,అమ్మాపురం గ్రామ సిపిఐ పార్టీ నాయకులు పబ్బోజు యాకాంత చారి, వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచు లింగన్న గౌడు తదితరులు ముత్తమ్మ మృత దేహాని కి ఎర్ర జెండా కప్పి, పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భం గా కామ్రేడ్ తమ్మెర విశ్వేశ్వరరావు,మాట్లాడుతూ.,తెలంగాణ సాయుధ పోరాటం లో ఆనాడు కొండపల్లి గోపాల్ రావు నాయకత్వం లో,మొగుళ్ళపల్లి మల్లయ్య,పురుషోత్తం గారు తదితరు వెంకటాపురం గ్రామాని కి చెందిన వ్యక్తులు రజాకారుల కు వ్యతి రేకం గా పోరాడి,జాల్నా జైలు లో జైలు జీవితం గడిపిన వ్యక్తులు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలని,తెలంగాణ ప్రజల కు నైజాం నవాబు నుండి విముక్తి పొందాలని,నైజాం నిరంకుశ చర్యల కు వ్యతి రేకం గా పోరాడిన వ్యక్తి మొగుళ్ళపల్లి మల్లయ్య,ముత్తమ్మ లు.ఆనాటి సాయుధ పోరాట ఫలితం గా తెలంగాణ ప్రాంత విముక్తి చెందడం జరిగింది.అటువంటి పోరాట యోధురాలు మరణించడం కమ్యూనిస్టు ఉద్యమాని కి తీరని లోటు అన్నారు.



## జ్యోతిబా పూలేకు ఘనంగా నివాళులు అర్పించిన బీసీ అఖిలపక్ష నాయకులు

కరీంనగర్ ఏప్రిల్ 11(వాయిస్ టుడే )మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ని పురస్కరించుకొని బీసీ సంఘాల అఖిలపక్ష నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కరీంనగర్ లోని జ్యోతిబా పూలే మైదానంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పూలే 198 జయంతి కార్యక్రమానికి సీనియర్ బీసీ నాయకుడు కేశిపెద్ది శ్రీధర్ రాజ్ మరియు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ లు ముఖ్య అతిధులుగా పాల్గొని పూలే చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని తెలిపారు.సమాజంలోని కులపరమైన వివక్షను రూపు మపడానికి తన జీవితాన్నే ధారపోసిన మహాత్ముడని కొనియాడారు.చదువు ద్వారానే బీసీలు అభివృద్ధి చెందుతారని ముఖ్యంగా మహిళలు చదువుకోవాలని తన భార్య సావిత్రి బాయి పూలే చదువు నేర్పించి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన గొప్ప ఆదర్శ మూర్తి అని అన్నారు.పూలే బ్రతికున్నంత కాలం బడుగుల అభ్యున్నతి కి కృషి చేసిన మహనీయులను నవ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. తన ఆశయాలను కొనసాగించడం కొరకు ప్రతి బీసీ బిడ్డ ముందుండాలని పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే మైదానంలో పూలే పుణ్య దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసి వారిని గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మంతెన కిరణ్ , దుప్పటపల్లి మురళి కార్యదర్శులు పెంట శ్రీనివాస్ , కాయతోజి బ్రహ్మచారి , యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ , రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి యస్ ఆనంద్, అధికార ప్రతినిధి పోశాల రవికుమార్ గౌడ్, రవీంద్ర చారి, బీసీ సీనియర్ నాయకులు వరాల నరేందర్, కుబుస ఆదర్శ్, పోకల విజయ్ , శ్రీనివాస్, ప్రసాద్ మరియు బీసీ అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## నా భూమిని కాంగ్రెసోళ్లు కబ్జా చేశారు.. మంత్రి కొండా సురేఖకు బాధితుడి ఫిర్యాదు



కరీమాబాద్, ఏప్రిల్ 11: కొందరు కాం గ్రెస్ నాయకులు తన భూమిని కబ్జా చేసి అందులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు ఇక్బాల్ అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖల మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశాడు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్‌లోని ఈద్గా లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన బాధితుడు ఇక్బాల్.. చింతల్‌లోని సర్వే నంబర్ 444లో గల 275 గజాల తన స్థలాన్ని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని, వారి కబ్జా నుంచి తన స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ.. విచారణ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

## కాంగ్రెస్ చేతిలో మళ్లీ మోసపోవద్దు

### కేంద్రంలో అధికారమిస్తే ఉగ్రదాడులే

### బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

నవాబ్‌పేట, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని మాజీ మంత్రి, బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో గురువారం బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు రైతులకు రేవంత్‌రెడ్డి ఇస్తామన్న రూ.500 బోనస్, రూ.15 వేల రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పథకాలు అమలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు కేంద్రంలో అధికారమిస్తే ఉగ్రదాడులు జరుగుతాయని చెప్పారు.